క్లుప్తంగా

స్వీపర్లకు రూ. 27 వేలు ఇవ్వాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : స్కూల్ స్వీపర్లకు రూ.27 వేల కనీస వేతనం ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు గట్టన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. డిమాండ్ల సాధన కోసం 56 రోజులుగా స్థానిక ధర్నాచౌక్‌లో చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం కొనసాగిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డిమాండ్లు నెరవేర్చేవరకు పోరాటం ఆగదన్నారు. బాలరాజు, నాగరాజు, బాలయ్య, యాదయ్య పాల్గొన్నారు.

కాపరులు ఆర్థికంగా ఎదగాలి



అడ్డాకుల: ప్రభుత్వం రాయితీ గొర్రెలను అందజేస్తున్నందునా వాటిని సద్వినియోగం చేసుకుని కాపరులు ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేట మండలం వేముల గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 6 మంది కాపరులకు రాయితీపై గొర్రెలు మంజూరు కావడంతో వాటిని ఆదివారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. డాక్టర్ మధుసూదన్, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ సత్యనారాయణ, లక్ష్మినర్సింహ్మా, రఘుపతిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

31న ప్రతిభా పురస్కారాల అందజేత

మహబూబ్‌నగర్ రూరల్: పదోతరగతి, ఇంటర్, ఎంసెట్, నీట్‌లలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థినీ, విద్యార్థులకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి వీరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు సంబంధిత పత్రాలను వాట్సప్ నంబర్ 9032844017కు ఈనెల 25లోపు పంపించాలని కోరారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన వారికి మచ్చ మాణిక్‌రావు పురస్కారంతో పాటు రూ. 5,116 నగదు బహుమతిని ఈనెల 31న రాఖీ పౌర్ణమి రోజు జరిగే కార్యక్రమంలో అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు



మిడ్జిల్: మండలకేంద్రంలో బస్టాండ్ వద్ద జడ్చర్ల –కల్వకుర్తి ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలోకి వచ్చే రహదారిని మూసివేశారు. గ్రామస్తుల వినతి మేరకు ఆదివారం రోడ్డు దాటకుండా చిన్నపాటి గోడ నిర్మాణం చేపట్టారు.

అసెంబ్లీ స్థానానికి దరఖాస్తు



స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టికెట్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు అందించారు. సీనియర్ నాయకుడు బెక్కరి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ దాడులను సహించేది లేదు’

జడ్చర్ల: నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ తీరును సహించేది లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మాజీ డీసీసీ అధ్యక్షులు ఒబెదుల్లాకొత్వాల్ అన్నారు. ఆదివారం నసరుల్లాబాద్‌లో ప్రజాహిత పాదయాత్ర చేస్తున్న టీపీసీసీ సెక్రటరీ అనిరుద్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయపడి జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిత, కాశన్నలను వారు పరామర్శించారు. పార్టీకి లభిస్తున్న ఆదరణను చూసి బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే సహనం కోల్పోయి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మినాజ్ నాయకులు ఉన్నారు.

సిగ్నల్ గడ్డ.. సమస్యల అడ్డా!



నత్తనడకన సాగుతున్న డ్రెయినేజీ పనులు



సిగ్నల్ గడ్డ ప్రధాన రహదారిపై దిగబడిన లారీ

- నత్త నడకన రోడ్డు విస్తరణ పనులు
- నరకం చూస్తున్న వాహనదారులు

జడ్చర్ల: పట్టణంలో రైల్వే బ్రిడ్జికి అటు మూడు, ఇటు మూడు ముఖ్య ప్రధాన రహదారులు కలిగి ఉన్న సిగ్నల్‌గడ్డ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. జడ్చర్ల నుంచి కోదాడ వరకు ప్రధాన రహదారిని జాతీయరహదారిగా విస్తరించి 167వ నంబర్‌గా గుర్తించిన క్రమంలో నైనా సిగ్నల్ గడ్డ తలరాత మారుతుందని అందరూ భావించారు. కానీ 167వ నంబర్ జాతీయరహదారి విస్తరణ పనులు పూర్తయినా సిగ్నల్‌గడ్డ వద్ద మాత్రం నిలిచిపోయాయి. కాగా ప్రధాన రహదారిపై వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము రేగుతోందని, ఓ వైపు గతుకుల రోడ్డు, మరో వైపు దుమ్ముతో నరకం చూస్తున్నామని స్థానికులు అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. పనుల్లో నాణ్యత కూడా కొరవడుతోందని విమర్శిస్తున్నారు. కనీసం దుమ్ము రేగకుండా రోడ్డుపై నీటిని చల్లడం, ప్రమాదభరితంగా మారిన గుంతలను పూడ్చడం వంటివి కూడా చేయడం లేదని అంటున్నారు. కాగా నిలిచిపోయిన పనులను ప్రారంభించేందుకు తిరిగి దాదాపు మూడేళ్ల సమయం పట్టిందని, సిగ్నల్‌గడ్డ బ్రిడ్జికి అటు ఇటుగా దాదాపు కి.మీ పొడవున పనులు చేపట్టాల్సి ఉందని అంటున్నారు. కానీ పనులు నెలల తరబడి సాగుతున్నాయని, ఎప్పటికీ పూర్తవుతాయో తెలియడం లేదని చెబుతున్నారు. దాదాపు రూ.45.81 కోట్లతో చేపట్టిన ఈ పనులను ప్రారంభించి దాదాపు ఆరు నెలలు కావస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎంతో ముఖ్యమైన రహదారిపై నిర్లక్ష్యం చూపడం తగదని అంటున్నారు. త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెంటనే పూర్తిచేయాలి

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలి. సిగ్నల్‌గడ్డ రహదారి అంటేనే భయమేస్తోంది. రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఉన్నాయి. దుమ్ము విపరీతంగా రేగడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. రోడ్డును అనుసరించి ఉన్న దుకాణాదారులు సైతం దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు.

–అబిదాలి మహ్మద్, జడ్చర్ల

తొమ్మిది నెలల్లో పూర్తిచేస్తాం

సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులను మరో 9 నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. గతంలో ఉన్న రోడ్‌ప్లాన్‌ను రీడిజైన్ చేయడం, రైల్వే శాఖ అనుమతులు, త దితర కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. మరో రెండు మూడు నెలల్లో అటు ఇటుగా అర కి.మీ మేర బీటీ రోడ్డు పనులు పూర్తిచేస్తాం.

–అశోక్‌రెడ్డి, డీఈఈ, జాతీయరహదారులు

నకిలీ ధ్రువపత్రాల రద్దు కోసం ఉద్యమం

మహబూబ్‌నగర్ రూరల్: నకిలీ కుల ధ్రువపత్రాల రద్దు కోసం ఉద్యమిస్తామని రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం కన్వీనర్ మల్లెపోగు శ్రీనివాస్ స్పష్టం చేశారు. మదాసి, మదారి నకిలీ కురువల ఎస్సీ కుల ధ్రువపత్రాల రద్దుపై ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. నకిలీ ధ్రువపత్రాలను తక్షణమే రద్దు చేయాలని, వాటిని తీసుకుంటున్న వారిపై కేసులు నమోదు చేయాలని, జారీ చేస్తున్న అధికారులను రిమూవల్ ఫ్రమ్ సర్వీసెస్ చేయాలని అన్నారు. అదేవిధంగా రిజర్వేషన్లు పెంచాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి రాష్ట్ర ఉద్యమ, ఉద్యోగ అడ్వైజరీ అడ్‌హాక్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మల్లెపోగు శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా బ్యాగరి వెంకటస్వామి, గడ్డమీది గోపాలకృష్ణలతో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎం.ప్రవీణ్‌కుమార్, అశోక్, సురేష్, రవికుమార్, రమేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఉద్యోగ కమిటీ కన్వీనర్‌గా రామచంద్రయ్య, కో-కన్వీనర్‌గా బ్యాగరి కాళిదాస్, సభ్యులుగా అనంతప్ప, బాలచంద్రుడు, అశోక్‌కుమార్ తదితరులు, అదేవిధంగా అడ్వైజరీ కమిటీ కన్వీనర్‌గా జె.బాలరాజు, కో-కన్వీనర్లుగా సుదర్శన్, శ్రీనివాసులు, సభ్యులుగా పరమేశ్వర్, వెంకటయ్య, ఎం.నర్సింహులు, కృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకలు



బంగారుమైసమ్మ ఆలయంలో భక్తులు

జడ్చర్ల టౌన్: శ్రావణమాసం నాగుల చవితి పురస్కరించుకుని మండలంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చైతన్యనగర్ బంగారుమైసమ్మ ఆలయంలో నాగుల విగ్రహాలు, పుట్టకు పాలు పోసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. అదేవిధంగా ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, విజయనగర్ సాయిబాబా ఆలయం, హౌజింగ్‌బోర్డు సీతారామాంజనేయస్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. పుట్టమన్ను తీసుకువెళ్లి ఇళ్ల ముఖద్వారం వద్ద నాగుల చిత్రాలను గీశారు.

ఘనంగా గాయత్రి మహాయజ్ఞం



మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆర్యసమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రి దేవసేయ శ్రావణి కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గాయత్రి మహాయజ్ఞం పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్, వేద గురుకుల ఆచార్యులు నవిత, ఆర్యసమాజ అధ్యక్షురాలు స్రవంతి, గుబ్బ నర్సింహులు, గుబ్బ అశోక్, బక్క రాజేశ్వర్, డా.విజయలక్ష్మి, నందిని, కృష్ణయ్యలు పాల్గొన్నారు. అనంతరం పాముల వల్ల కలిగే ప్రయోజనాలపై డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా. సదాశివయ్య అవగాహన కల్పించారు.

గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుశీల

రాజాపూర్: గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, పంచాయతీలకు నేరుగా నిధులు కేటాయించడంతో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని మండల ఎంపీపీ సుశీల అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో అండర్‌డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో బీఆర్‌ఎస్ మోసం



మణికొండలో పల్లెబాట

మహబూబ్‌నగర్ రూరల్: సంక్షేమ పథకాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొండ సత్యయాదవ్ ఆరోపించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడ్డదని అన్నారు. బీజేపీ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మనికొండ గ్రామంలో 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో ఆ పార్టీ ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడినవేళ గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం ప్రజలను మభ్యపెట్టడానికే అని అన్నారు. ఏ సంక్షేమ పథకాలైన ఆన్‌లైన్‌లో ఉండగా, గృహలక్ష్మి పథకాన్ని మాత్రం ఆఫ్‌లైన్ దరఖాస్తులు ఎందుకు అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ బొంగు గంగన్న, నాయకులు వెంకట్రామిరెడ్డి, నాగరాజుగౌడ్, మోహన్, రాఘవేందర్‌గౌడ్, చంద్రశేఖర్, రాగి శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడమ్మ బోనాలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని చౌడమ్మగుట్ట వద్ద ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కావేరమ్మపేటలో అమ్మవారికి పూజలు నిర్వహించిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు బోనాల ఉత్సవాన్ని ప్రారంభించారు. నవధాన్యాలతో నిండిన కొత్త గంపలను మహిళలు తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలు, యాదవ సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు ముందుకు సాగింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి 10.30 గంటల తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎల్‌అండ్‌టీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు తగవని, రేవంత్ రెడ్డి అలాంటి వ్యాఖ్యలు చేస్తే కేసులు పెట్టక ఏం చేస్తారని రైతు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్ యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పడం సమంజసం కాదని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే రైతులు తరిమికొడతారని అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గురించి తప్పుగా మాట్లాడితే సహించబోమన్నారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ రహమాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి మాజీ సర్పంచ్ బుచ్చమ్మ అనారోగ్యానితో గుర్తై శనివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. అడ్డాకుల జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, పెద్దమండడి ఎంపీపీ మేఘారెడ్డి చెరో రూ.5వేలను పంపడంతో వాటిని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ గణేష్, శ్రీధర్‌యాదవ్, నర్సింహ్మా, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గ విస్తరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్వహిందూ పరిషత్ పాలమూరు కార్యవర్గ కమిటీని ఆదివారం విస్తరించారు. నగర కార్యదర్శులుగా భరత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా భరద్వాజ నారాయణ, లక్ష్మణ్‌రావు, సతీష్ రాఠి, సహాయ కార్యదర్శిగా శివకుమార్, నిరంజన్, మాతృ శక్తి అధ్యక్షురాలుగా సంధ్య, గోరక్షా ప్రముఖ్‌గా భాస్కర్, అర్చక పురోహిత ప్రముఖ్‌గా వినోద్, నగర బజరంగ్‌దళ్ సంయోజక్‌గా సతీష్, సహ సంయోజక్‌లుగా ఆంజనేయులు, దినేష్‌లను నియమించారు. జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి



మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని పాతపాలమూరు, వీరన్నపేట, పాతతోట ప్రాంతాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కేవీపీఎస్ పట్టణ అధ్యక్షుడు ఎ.సత్యం, కార్యదర్శి ఆది విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లు కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఆదివారం పాతపాలమూరులో పర్యటించి కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, శ్రీను, సహాయ కార్యదర్శి శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

వీరాంజనేయ ఆలయంలో సంప్రోక్షణ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురా పవనపుత్ర వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేపట్టారు. బీజేపీ నాయకుడు ఎన్పీ వెంకటేష్, సత్యనారాయణయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంతు, రాము తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్‌ఎస్‌దే గెలుపు



లైట్లు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: హన్మసానిపల్లిలో ఆదివారం ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హైమాస్ లైట్లు ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధులు రూ.5 లక్షలతో లైట్లు ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, రైతుబంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జడ్చర్లలో మరోసారి బీఆర్‌ఎస్ గెలుపుఖాయమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. కారుకొండ, కూచూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా నాయకులు నాగిరెడ్డి, ఎంపీటీసీ గోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేష్, డైరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, నర్సింహులు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా పోరాటం



మాట్లాడుతున్న నారాయణమ్మ

దేవరకద్ర: సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా పోరాడుదామని టీపీటీఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు నారాయణమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకద్ర మార్కెట్ యార్డులో జరిగిన జిల్లా ప్రగతిశీలా మహిళా సంఘం 6వ మహాసభలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, హత్యలకు, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రగతి శీల మహిళా సంఘం పోరాటం చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, శాంత, సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకులు కృష్ణ, జిల్లా కార్యదర్శి సీహెచ్.రాంచందర్, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, మహిళా ప్రతినిధులు ప్రమీల, భాగ్యలక్ష్మి, అలివేల, చంద్రకళ,, లక్ష్మమ్మ, రాజమణి, సువర్ణ, పీవైఎల్ నాయకులు బాలు, రాజు, వెంకట్రాములు, చంద్రన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేం



జిల్లాకేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్వాల్ మాట్లాడుతూ యువతకు ఆదర్శప్రాయుడు రాజీవ్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, రమేశ్, ఎం.ఎ.ఫహీం, ఫయాజ్, ఫక్రు ఖురేషి, పీర్ సాధిక్, అలీం, అజీజ్, కృష్ణయ్య, ఫకీర్ అహ్మద్, రాంరెడ్డి, గంగిరెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌లో నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, బాలరాజు, రాంరెడ్డి, పాశం దాదెన్న, కాంతయ్య, శివకుమార్, శాంతయ్యగౌడ్, అంజనేయులు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఇందిరమ్మ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ సర్పంచ్ వెంకటేశం, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



శాఖాపూర్‌లో..

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, నాగయ్య, భాషానాయక్, తదితరులు పాల్గొన్నారు.